ఆంధ్రజ్యోతి



5 జయశంకర్ భూపాలపల్లి

గురువారం 13 ఫిబ్రవరి 2025

దిష్టి తోరణం కింద బెల్లం పాకం ఆరబోస్తున్న పూజారులు



మండమెలిగె.. మది మురిసే..

మేడారంలో ఘనంగా మినీ జాతర వేడుకలు

భక్తజన సందోహంతో మేడారం కిటకిటలాడింది. మినీ జాతర ప్రారంభం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండమెలిగె పండుగ సందర్భంగా పూజారులు మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టితోరణాలు కట్టారు. అందులో కోడిపిల్ల, సొరకాయను కట్టారు. ఈ సందర్భంగా భక్తులు పోటెత్తారు. సమ్మక్క - సారలమ్మలను, గోవిందరాజులు, పగిడిద్దరాజులను తాకేందుకు పోటీపడ్డారు. తొలుత జంపన్నవాగులో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు ఆచరించి.. ఆపై ఎత్తు బంగారంతో పాటు పసుపు, కుంకుమ, చీర సారెలను అమ్మవార్లకు సమర్పించారు. జంతు బలులు ఇచ్చి అడవిలో విందారగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కోలాహలం కనిపించింది. సుమారు 2.5 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి)



జంపన్నవాగులో పుణ్యస్నానం చేస్తున్న యువతి

- అంతర్గత పూజలు చేసిన పూజారులు
- కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం
- సుమారు 2.5 లక్షల మంది భక్తుల రాక
- సందడిగా మారిన వనదేవతల సన్నిధి

7



మేడారంలోని సమ్మక్క ఆలయం నుంచి పూజా సామగ్రిని గద్దెల వద్దకు జాగారానికి తీసుకెళుతున్న ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య, ఇతర పూజారులు



అమ్మవార్లకు ఎత్తు బంగారం తీసుకెళుతున్న భక్తురాలు

విపక్షాల విమర్శలు తిప్పికొట్టండి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పారదర్శకతపై హర్షం
- భూపాలపల్లిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణపై విపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రజలకు పిలుపునిచ్చారు. భూపాలపల్లి పట్టణంలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జవహర్ కాలనీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులగణన సర్వే అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు. పదేళ్ల క్రితం సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా బయటకు చెప్పలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరమన్నారమని విమర్శించారు. ఎస్సీల్లో 59 కులాల ఉండగా వర్గీకరణ జరగక ఏళ్ల తరబడి వెనుకబడి పోయారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ప్రజా ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చిందని అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకొచ్చి ప్రజలకు చేరువ అయ్యిందని అన్నారు. ఇది భరించలేని విపక్ష నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కుల గణన విషయంలో ఎంతో శాస్త్రీయంగా వ్యవహరించిన ప్రభుత్వం అధికారుల ద్వారా ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయించిందని తెలిపారు. ఈ క్రమంలో నే బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనంత మేరకు ఎక్కువ స్థానాలు ఏకగ్రీవం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లోని అన్ని విభాగాల శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం పట్టణ కమిటీ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించగా ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, రంజిత్, ఆకుల మహేందర్, సమ్మిరెడ్డి, అప్పం కిషన్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో కాంగ్రెస్ కార్యకర్తలు

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు

కాటారం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీల నేతలు మధ్యాహ్న భోజన కార్మికులకు పలు హామీల చేశారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెల రూ.10వేలు వేతనంగా అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దయ్యం పోచయ్య, కార్మికసంఘం నేత గడ్డం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బర్డ్‌ఫ్లూ నివారణ

డీవీహెచ్‌వో కుమారస్వామి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే బర్డ్ ఫ్లూను నివారించొచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి (డీవీహెచ్‌వో) కుమారస్వామి అన్నారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, సిబ్బందితోపాటు కోళ్ల ఫారాల రైతులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి రైతులకు కల్పించాల్సిన అవగాహనపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫారా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 35 కోళ్ల ఫారాల రైతులకు వ్యాధిపై సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు.

సాగుకు సరిపడా యూరియా

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో వరి 85,675 ఎకరాలు, మొక్క జొన్న 16,843, ఉద్యాన పంటలతో కలిపి 22,670 ఎకరాలు సాగు అవుతున్నట్లు తెలిపారు. వీటికి 18,800 టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 10,513 టన్నులు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు.. ప్రస్తుతం ఇంకా 2570 టన్నుల నిల్వ ఉందని, ఇంకా 5,717 టన్నులు అవసరం ఉందని వివరించారు. జిల్లాకు మార్క్‌ఫెడ్ ద్వారా 2వేల టన్నులు యూరియాను కేటాయించారని తెలిపారు. రైతులు ఆందోళన చెందెలాల్సిన అవసరం లేదని, సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంటుందని వివరించారు.



అడవంతా జల్లెడ.. కానిరాని పులి జాడ

- తీవ్రంగా అన్వేషిస్తున్న ఫారెస్టు అధికారులు
- 8 బృందాలుగా ఏర్పడి ముమ్మంగా గాలింపు
- ఇంకా ఇక్కడే ఉందా... వెళ్లిపోయిందా? అనేదే సస్పెన్స్

కాటారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. ఫారెస్టు అధికారులు ఎంతగా అన్వేషిస్తున్నా దాని జాడ కానరావడం లేదు. మహదేవపూర్ డివిజన్‌లోని కాటారం, మహదేవపూర్ రేంజ్ పరిధిలోని అడవులను అధికారులు జల్లెడ పడుతున్నారు. కాటారం ఎఫ్ఆర్వో స్వాతి, కాటారం, మహదేవపూర్, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు చంద్రశేఖర్, అర్చన, సుమన్, వరుణ్ నేతృత్వంలో సిబ్బంది 8 బృందాలుగా విడిపోయి అడవుల్లో అన్వేషిస్తున్నారు. గత రెండురోజుల్లో కొన్ని చోట్ల మాత్రమే పులి పాదముద్రలు మాత్రమే కనిపించగా మూడో రోజు పాదముద్రల ఆనవాళ్లు కనిపించకపోవడంతో పులి డివిజన్ పరిధి అడవుల్లోనే ఉందా.. జిల్లా హద్దు దాటి వెళ్లిందా? అనేది తెలియడం లేదు. అడవుల్లో జింకలు, పశువులు తిరగాడతాయని, వాటిపై పులి దాడిచేస్తే వాసన వచ్చేదని అధికారులు అంటున్నారు. పాదముద్రల ఆనవాళ్లు పూర్తిస్థాయిలో స్పష్టంగా ఉన్నా పులి ఎక్కడ ఉందనేది తెలిసేదని తలలు పట్టుకుంటున్నారు. పులి జాడ కోసం గాలిస్తున్న బృందాల్లో అటవీ శాఖ అధికారులు సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, ప్లాంటేషన్ల వాచర్లు తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా ఇలాంటి టెన్షన్లే..

కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పెద్దపులి సంచారం ప్రజల్లో గుబులు పుట్టిస్తోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి పులులు ప్రతి సంవత్సరం భూపాలపల్లి జిల్లాకు వలస బాట పడుతున్నాయని తెలుస్తోంది. 2020 సెప్టెంబరులో మహారాష్ట్ర సరిహద్దు దాటి వచ్చిన పులి భూపాలపల్లి డివిజన్ పరిధిలోని ఆజంనగర్ రేంజ్, భూపాలపల్లి రేంజ్, చెల్పూరు రేంజ్‌ల పరిధిలో వారం రోజుల పాటు ఉండి మంథనిలోని మానేరు వాగు దాటి పెద్దపెల్లి జిల్లాకు వెళ్లింది. 2021 చివర్లో ఓ పెద్దపులి భూపాలపల్లి, చెల్పూరు, కొయ్యూరు రేంజ్‌లలో పది రోజుల పాటు బస చేసి పెద్దపెల్లి అడవుల్లోకి వెళ్లింది. 2022లో మంథని నుంచి కొయ్యూరు, కాటారం వచ్చిన పెద్దపులి ఒకటి ఆవుపై దాడిచేసి చంపేసింది. అనంతరం పలిమెల రేంజ్ పరిధిలో మరో ఆవుపై దాడిచేసి చంపేసి గోదావరి దాటి మహారాష్ట్ర అడవుల్లోకి వెళ్లిపోయింది. అదే సంవత్సరం ఆగస్టు నెలలో మహారాష్ట్ర అడవుల్లో నుంచి వచ్చిన పెద్దపులి ఒకటి భూపాలపల్లి రేంజ్ పరిధిలోని బొగ్గువాగు సమీపంలో స్థావరం ఏర్పాటు చేసుకుని పది రోజుల పాటు ఉండి నాలుగు బర్లను చంపింది. అనంతరం రాంపూర్ నుంచి ఏటూరునాగారం మీదుగా మహారాష్ట్ర అడవుల్లోకి వెళ్లిపోయింది. 2024లో కూడా పెద్దపులి జిలాలో సంచరించినట్టు పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. మళ్లీ ఇప్పుడు కాటారం రేంజ్ పరిధిలో వీరాపూర్ అడవుల్లో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో అటవీశాఖ సిబ్బంది పులి జాడ కోసం మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... కావాలని ఫారెస్టు అధికారులు సూచిస్తున్నారు. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దని, వలలు, ఉచ్చులు పెట్టొద్దని, పెద్దపులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.



అడవిలో పులి జాడ కోసం గాలిస్తున్న ఫారెస్టు అధికారులు

పారితోషికం రాక పరేషాన్

- కులగణన ఎన్యుమరేటర్లకు అందని పైకం
- ఇప్పటి వరకు డబ్బులు చెల్లించని అధికారులు
- సీసీఎల్స్ కూడా యాడ్ కాని వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనకు సంబంధించి పారితోషికం కోసం ఎన్యుమరేటర్లు ఎదురుచూస్తున్నారు. సర్వే పూర్తయి తుది నివేదిక ప్రభుత్వానికి ఇచ్చి రోజులు గడుస్తున్నా ఇంత వరకు తమకు డబ్బులు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్ల పరిస్థితి ఇలాగే ఉందని తెలుస్తోంది. మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హర్, కాటారం, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గణపురం, భూపాలపల్లి, కొత్తపల్లిగోరి మండలాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్యుమరేటర్లుగా విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులతోపాటు పంచాయతీ కార్యదర్శులకు సర్వే డబ్బులు అందలేదు. వీరితో పాటు కులగణన ఫారాలను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లకు సైతం ఇప్పటి వరకు పారితోషికం అందలేదు. పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌గా మండల స్థాయి అధికారులు సర్వేను పర్యవేక్షించగా వారికి కూడా ఇప్పటి వరకు చెల్లించలేదని తెలుస్తోంది. సర్వే డబ్బులు ముందే చెల్లించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకు అవి తమకు అందకపోవడం పట్ల ఎన్యుమరేటర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయించని సీసీఎల్‌లు

సర్వే సమయంలో ఐదు రోజులపాటు సెలవు దినాల్లోనూ ఉపాధ్యాయులు, కార్యదర్శులు విధులు నిర్వర్తించారు. ఈ ఐదు రోజులను వార్షిక సెలవు దినాలకు యాడ్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అవి కూడా వర్తించలేదు. సీసీఎల్స్‌ను ఆరు నెలల్లోపు వినియోగించుకోకపోతే అవికాస్త పనికిరాకుండా పోతాయని ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క జిల్లాల్లో సర్వే చేసిన డబ్బులు చెల్లించడంతోపాటు సీసీఎల్స్‌ను వార్షిక సెలవు దినాలకు యాడ్ చేశారని, భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఇది వర్తించలేదని అంటున్నారు. సర్వే పూర్తయి ఇప్పటికే నెలన్నర రోజులు గడిచిపోగా మరో నెలన్న రోజుల్లోనే పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభం కానుండటం, ఆతర్వాత వేసవి సెలవులు రానుండటంతో సీసీఎల్స్‌ను గడువు



మిగతా 8వ పేజీలో...



ఆధార్ వాలిడేషన్‌పై మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ఆధార్ వాలిడేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ వాలిడేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఏకశిల ఏంజిల్స్ హై స్కూల్‌లో బుధవారం పీఎం శ్రీ, యు-డైస్ ప్లస్, ఆధార్ వాలిడేషన్‌పై ఎంఈవోలు, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో ఐఎస్బీ ప్యానెల్ శిక్షణ శిబిరంలో గణితం, జీవశాస్త్రం, భౌతిక రసాయనశాస్త్రం, సాంఘీక శాస్త్రంకు సంబంధించిన ఐఎఫ్‌పీ ప్యానల్స్, డిజిటల్ బోర్డులను వినియోగంపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐఎఫ్‌పీ, డిజిటల్ బోర్డులను ఉపయోగిస్తూ బోధన చేయాలన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో కూడా నిర్వహించే శిక్షణ సమావేశాలని విజయవంతం చేయాలన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేయాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా విద్యార్థులకు పాఠ్యాంశాలు చెప్పవద్దన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఐఎఫ్‌పీల వినియోగాన్ని ఉపాధ్యాయులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజేశ్వర్‌రావు, ఎఫ్ఏవో మహంకాళి బుచ్చయ్య, కో-ఆర్డినేటర్లు పూర్ణచందర్, చంద్రశేఖర్ ఆజాద్, సంతోష్, కోటియా, సిరినాయక్, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.

మేడారానికి బయలు దేరిన పూజారులు



పూనుగొండ్ల నుంచి పసుపు, కుంకుమలతో బయలు దేరిన పూజారులు

గంగారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో కొలువైన సమ్మక్క భర్త పగిడిద్దరాజు ఆలయం నుంచి పూజారులు పసుపు కుంకుమలు తీసుకుని బుధవారం మేడారం బయలు దేరినట్లు ప్రధాన పూజారి పెనక రాజేశ్వర్ తెలిపారు. ములుగు జిల్లా మేడారంలో జరిగే మినీజాతరకు పగిడిద్దరాజు ఆలయం నుంచి పసుపు కుంకుమలతో సాయం త్రం మేలతాళాలతో దట్టమైన అడవి మార్గంలో కాలినడకన ప్రయాణమ య్యారు. ఈ బృందం గురువారం తెల్లవారు జామునకు మేడారం పగిడిద్దరాజు గద్దెకు చేరుకుంటుందని వివరించారు. పగిడిద్దరాజుతో తరలివెళ్లిన వారిలో పెనక పురుషోత్తం, సురేందర్, పెనక సమ్మయ్య, రాహుల్, సురేష్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రామన్నగూడెంలో విషాదం



ఉప్పలయ్య (ఫైల్)

నర్సింహులపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చాపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో బుధవారం జరిగింది. ఎస్సై మాలోత్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుండి ఉప్పలయ్య(45) ముంగిమడుగు పరిధిలోని వెంకమ్మ చెరువు బైండ్లోని దగ్గరలోని ఓ బురద గుంతలో కర్రకు విద్యుత్ వైరును ఏర్పాటు చేసి చేపలు పడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పలయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో మునిసిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణానికి సరఫరా అవుతున్న మంచినీటి బావులు, బోర్‌లను ఆమె పరిశీలించి ఫోన్‌లో అధికారులకు తగు సూచనలు చేశారు. భగీరథ నీటితో పాటు మంచినీటి బావులను కూడా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు నిరంతర సరఫరాకు అన్ని విధాల కృషి చేస్తున్నామని, మరికొన్ని రోజుల్లో పట్టణంలో ప్రతిరోజు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.నిరంజన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, రాంచంద్రయ్య, నరేందర్ రెడ్డి, దరావత్ సోమన్న, దొంగరి శంకర్, కిషన్ యాదవ్, మహ్మద్ జలీల్, సురేష్ తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. వడ్డెకత్తాపల్లి గ్రామ శివారులోని బయన్నవాగుపై నిర్మించిన డ్యామ్‌ను పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ దేశం అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కొనసాగుతున్నాయన్నారు. తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, బ్లాక్ అధ్యక్షులు హుస్సేనాయక్, మాజీ పీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ జడ్పీఫ్లోర్‌లీడర్ ఎన్. ప్రవీణ్‌రావు, జాటోత్ నెహ్రూనాయక్, విజయపాల్‌రెడ్డి, రంగు మురళి గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అట్టర్‌ప్లాప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

- స్థానిక సంస్థల్లో ఎగిరేది గులాబీ జెండానే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ప్లాప్ అయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటేనే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు రోడ్ల మీద తిరిగే పరిస్థితి లేదని విమర్శిం చారు. కాంగ్రెస్ పార్టీ మునిగిన నావ అని, గతంలో 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేదని, ఇప్పుడు మూడు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పని చేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలే త్వరలో బొంద పెడతారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, యాదగిరిరావు, సోమనర్సింహారెడ్డి, శ్రీరాం రాము, అనపురం రవి, పూర్ణచందర్, భాస్కర్, పటేల్, కుమార్, సతీష్, అనుదీప్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలి

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ



జిల్లా మహా సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో జంపాల రవీందర్ అధ్యక్షతన బుధవారం జరిగిన రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ములుగు జిల్లా నుంచి దూర ప్రాంతాలకు సాగునీటిని తరలిస్తున్న పాలకులు ఈ జిల్లాలోని చెరువులను ఎందుకు అనుసంధానం చేయడంలేదని ప్రశ్నించారు. ఈవిషయంలో రాష్ట్రమంత్రి సీతక్క చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ములుగు మండలంలోని బొగ్గులవాగుపై చెక్ డ్యామ్ నిర్మించాలని, దీంతో 300 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని అన్నారు. వర్షాకాలంలో రహదారి సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. పొట్లాపూర్ ఏదుళ్లచెరువు దగ్గరి నుంచి నర్సంపేట రంగాయ చెరువుకు తరలిస్తున్న నీటిని ఏదుళ్ల చెరువు వద్ద చెక్‌పాయింట్ ఏర్పాటు చేయాలని, వాజేడు మండలంలోని మోడికుంటవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, అనేక గ్రామాల్లో నీటి వసతి కల్పించాలని, పోడుభూములకు పూర్తిస్థాయిలో హక్కుపత్రాలు అందించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, నాయకులు సారంగపాణి, మామిడాల సమ్మిరెడ్డి, మంద సదాలక్ష్మి, ఎమ్డీ.అమ్జద్‌పాషా, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, గడ్డం కృష్ణ, బండారి శ్రీనివాస్, నాసర్, రైతు ప్రతినిధులు జక్కుల ఐలయ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మున్నూరు కాపు సంఘం నాయకులు



కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మున్నూరు కాపు సంఘం నాయకులు

కేసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణనలో మున్నూరుకాపు కులస్థుల సంఖ్యను తక్కువగా చూపారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి బుధవారం తరలిరావాలని సంఘం ఇచ్చిన పిలుపుతో పోలీసుల అప్రమత్తమయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులను చందా గోపి, ముత్యాల శివకుమార్, సింగంశెట్టి యాకాంతం(చంటి), లక్కాకుల సత్యనారాయణ, సుందర్ వెంకన్న, పాల శ్రీనివాస్, కముటం పెద్దస్వామి, తోట నాగయ్య, పిన్ని రామును తెల్లవారుజామునే పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న గుడుంబా, బెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు

నెహ్రూ సెంటర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి, టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని కురవి మండలం రేకులతండా, బాలుతండా, హరిదాస్‌తండా, కంచర్లగూడెం, మహబూబాబాద్ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఏడుగురుపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 35 లీటర్ల గుడుంబా, 120 కిలోల బెల్లం, 8 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. సంబంధిత బాధితులను ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లుపేర్కొన్నారు. ఈ దాడుల్లో సీహెచ్.నాగేశ్వర్‌రావు, బిక్షరెడ్డి, అశోక్‌కుమార్,చంద్రశేఖర్, కిరిటి, సతీష్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2109	2100
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	4700	3100
కందులు	7083	5540
పెసళ్లు	6682	5645
పత్తి	6950	5800
పసుపు (కాడి)	7677	6425
తేజ మిర్చి	13300	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14700	11500
యూఎస్ 341	13550	11500
దేశీ ఏసీ	25011	22500
దీపిక	16110	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కాళేశ్వరంలో గోదావరి హారతి

మహదేవపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు బుధవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి నాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. బుధవారం కాళేశ్వర ప్రధాన అర్చకులు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు కాళేశ్వర దేవస్థానం నుంచి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ వేద మంత్రోచ్ఛరణలతో గోదావరి నదికి చేరుకున్నారు. అనంతరం గోదావరి నది హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్. మహేష్, దేవస్థాన సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

బీజేపీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి విజయచందర్‌రెడ్డి

ములుగు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ విజయచందర్‌రెడ్డి కోరారు. ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన శాసన మండలి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు బీజేపీకి ఓటేసేలా కృషి చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకాక, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, 317జీవోతో స్థానికతను కోల్పోయారని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ముందుండి పోరాడిందన్నారు. అధికార పక్షాన్ని మండలిలో ప్రశ్నించే గొంతుకగా బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నంపల్లి పాపన్న, నాయకులు కొత్త సుధాకర్‌రెడ్డి, భూక్యా జవహర్‌లాల్, కొత్త సురేందర్, శ్రీలమంతుల రవీంద్రాచారి, భర్తపురం నరేష్, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, జాడి వెంకట్, గుగులోతు స్వరూప, పల్ల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మరిపెడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆకేరు, పాలేరు వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీష్ గౌడ్ తెలిపారు. మండలంలోని బాల్ని ధర్మారం, తానంచెర్ల రెవెన్యూ పరిధి అజ్మీరాతండ సమీపంలో ఆకేరు, పాలేరు వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న బాదావత్ హరికృష్ణ, కొంపెల్లి మహేష్, భూక్య చంటి, ముదిరెడ్డి సురేష్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మహదేవపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఇసుక లారీ ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ శివారులోని ఎడపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. భూపాలపల్లికి చెందిన ఉజ్జల ప్రేమ్, మేకల రాకేష్, లక్ష్మణ్ అనే యువకులు ఒకే మోటారు సైకిల్‌పై కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకొని తిరిగి భూపాలపల్లికి వెళ్తుండగా ప్రమా దం జరిగింది. కాళేశ్వరం- మహదేవపూర్ రహదారిలోని ఎడపల్లి వద్ద గుర్తు తెలియని ఇసుక లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యా యి. అటుగా వస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్డుపై పడి ఉన్న యువకులను చూసి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహ నం ద్వారా తరలించారు. ప్రథమ చికిత్స కోసం అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్లు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపారు. ఈ ఘటనపై తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంతో రోడ్డుపై వాహనాలు గంట సేపు నిలిచాయి. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరించడంతో పాటు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పీఏసీఎస్ డైరెక్టర్ ఆత్మహత్య



గజ్జి రమేష్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో మనస్తాపానికి గురైన మన్నెగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జి రమేష్ (48) ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుక్కొయ్యలపాడుకు చెందిన గజ్జి రమేష్ గతంలో కుటుంబ అవసరాల కోసం రూ. 6 లక్షల అప్పు చేశాడు. తనకున్న నాలుగు ఎకరాల భూమిలో ఎకరం భూమిని విక్రయించి, కొంత మేర అప్పులు తీర్చాడు. అయినా మరికొంత అప్పు ఉండడంతో అవి ఎలా తీర్చాలని మనస్తాపానికి గురైన రమేష్ ఈనెల 5న తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి

పెద్దవంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నవంగర గ్రామానికి చెందిన అనపురం వెంకన్న (55) వ్యవసాయం చేస్తూ, కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండల కేంద్రం శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద కన్నె వేణు వ్యవసాయ క్షేత్రం శివారులో రోజువారీ మాదిరిగా కల్లుగీసేందుకు వెళ్లాడు. వ్యవసాయ క్షేత్రం వద్ద మొక్కజొన్న పంటను కోతుల నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ వైర్లను అమర్చడంతో ప్రమాదవశాత్తు వెంకన్న చేయి, కాళ్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య అనసూర్య, ఇద్దరు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలంను పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


శ్రీతేజ్


జి. రమేష్


జి. తరుణ్


ఎన్. హన్సిక


అన్వర్‌పాషా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శివాని విశ్వరూపం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హనుమకొండలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించి విశ్వరూపం ప్రదర్శించారని కళాశాల కరస్పాండెట్ టి.స్వామి, ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి తెలిపారు. జేఈఈ మెయిన్స్ సెషన్-2025 ఫలితాల్లో కళాశాలకు చెందిన కె.శ్రీతేజ్ 97.97, జి.రమేష్ 95.88, జి.తరుణ్ 95.66, ఎన్.హన్సిక 95.30, ఎండి. అన్వర్ పాషా 94.84 ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో షైన్ ప్రభంజనం


జి. వికాస్


శ్రీమహేష్


సీహెచ్ శ్రీతన్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ -2025 ఫలితాలలో 98.59 పర్సంటైల్ సాధించి విజయదుందుభి సాధించామని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, డైరెక్టర్లు మూగల రమ, పి.రాజేంద్రకుమార్, మూగల రమేష్ సంయుక్తంగా తెలియజేశారు. మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కళాశాల జాతీయ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్‌లలో అత్యుత్తత శిక్షణను అందిస్తోందని తెలిపారు. అకడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా విద్యార్థులను ఆణిముత్యాలుగా తయారు చేసి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నామని ఈ సందర్భంగా జి.వికాస్ 98.59, పి.శ్రీమహేష్ 97.23, సీహెచ్.శ్రీతన్ 96.04 పర్సంటైల్‌ను సాధించిన ర్యాంకులు విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు 29 మంది విద్యార్థులు 90.0 పర్సంటైల్ పైగా ఫలితాలు సాధించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఐఐటీ కోఆర్డినేటర్ రమేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ మారబోయిన రాజుగౌడ్, శ్రీనివాసన్, సంధ్యా, ప్రశాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కెరీర్ పాయింట్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కెరీర్ పాయింట్ చైర్మన్, ఫ్యాకల్టీ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ(మెయిన్స్) - 2025 ఫలితాలలో హనుమకొండ న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించినట్లు కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జూలపల్లి కరుణాకర్‌రావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం కెరీర్‌పాయింట్‌లో చైర్మన్, డైరెక్టర్‌లు అభినందించారు. కెరీర్ పాయింట్‌లకు చెందిన వి.రామ్‌చరణ్ 99.86, భవేష్ 99.71, శ్రీచైత్ర 99.49, సుధీష్ 99 పర్సంటైల్‌తోపాటు మరికొందరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చైర్మన్ కరుణాకర్‌రావు తెలిపారు. చైర్మన్‌తో పాటు బ్రాంచ్ డైరెక్టర్లు, మధుపాల్‌రావు, ప్రిన్సిపాల్ దేవేందర్ కోటా ఫ్యాకల్టీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

రెజోనెన్స్ విజయదుందుభి


జేఈఈ మెయిన్స్ సెషన్-1 విజేతలతో రెజోనెన్స్ చైర్మన్ రాజిరెడ్డి, ఫ్యాకల్టీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రెజోనెన్స్ కళాశాల విజయదుందుభి మోగించడం హర్షణీయమని రెజోనెన్స్ వరంగల్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హనుమకొండలోని కళాశాలలో జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎం.చరణ్ 99.89 పర్సంటైల్ సాధించడంతో పాటు ఫిజిక్స్‌లో 100 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే బి.వెంకట్ జశ్వంత్ 99.66, సీహెచ్. సాయిదత్తు 99.59, కె.శిత్రీజ్ 99.56, వి.శశికౌశిక్ 99.48, ఎం.డి. ఉర్రహ్మాన్ 99.27, వి.వి. ఫణి హర్షిత్ 99.26, వి.రాజశేఖర్ 99.25 పర్సంటైల్ సాధించినట్లు ఆయన వివరించారు. వీరితో పాటు మరికొంత మంది విద్యార్థులు దేశంలోని సుప్రసిద్ధ ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. పోటీ పరీక్షలు ఏవైనా రెజోనెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. దీనంతటికీ విద్యార్థుల శ్రమ, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏవో లెక్కల రమ్యారెడ్డి, అకడమిక్ డీన్ టీఎస్. గోపాల్‌రావు, కళాశాలల ప్రిన్సిపాళ్ల తదితరులు పాల్గొన్నారు.

మోషన్ కళాశాల విజయ కేతనం


గుడి వంశీప్రియ


జీ అశ్విత


కే ప్రహర్షిత


ఎం సహస్ర


బూర్ల వర్షిత


సామంతుల శ్రీనిధి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025లో మోషన్ విద్యాసంస్థల విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఈఈ ఫలితాలలో గుడి వంశీప్రియ 97.56, గుండబోయిన అశ్విత 95.88, కొండపాక ప్రహర్షిత 92.53, ముడుతనపల్లి సహస్ర 92.34, బూర్ల వర్షిత 91.52, సామంతుల శ్రీనిధి 90.02, పర్సంటైల్ సాధించి మోషన్ కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో నిలబెట్టడం పట్ల హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఫలితాలు సాధించిన విద్యార్థులను వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌తో పాటు కళాశాల యాజమాన్యం అభినందించింది.


మండమెలిగె సందర్భంగా జాగారం కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క



మండమెలిగె.. మది మురిసే

మేడారంలో ఘనంగా మినీ జాతర వేడుకలు

- అంతర్గత పూజలు చేసిన పూజారులు
- కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండ మెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకు పూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప, ధూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. అనంతరం మేడారంలోని గద్దెలకు డోలు వాయిద్యాలు కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్ల ఆరబోస్తుండగా పూజారులు వడ్డెలు గద్దెలకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు వన దేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

జంపన్నవాగులో స్నానాలు ఆచరించి..

ముందుగా జంపన్నవాగులోని స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన నల్లాల కింద పుణ్యస్నానాలు చేసి వాగు ఒడ్డున ఉన్న కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారల మ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాలు, డప్పు సప్పుల్ల నడుమ శివసత్తుల పూనకాలతో ఎత్తు బంగారం మోస్తూ గద్దెలకు చేరుకున్నారు. తల్లులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరెలు, సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారాని సమర్పిచారు. కోరికలు తీరాలని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భద్రత

మినీ జాతరలో పోలీసులు భారీ భద్రత కల్పించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తులు సులభంగా దర్శనాలు చేసుకోనేలా చర్యలు చేపట్టారు. ఈ బందోబస్తును ములుగు డీఎస్పీ రవీందర్ పర్యవేక్షించారు. అలాగే మినీ జాతర సందర్భంగా వనదేవతలు సమ్మక్క, సారలమ్మల దర్శనానికి తరలివచ్చిన భక్తులను దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. మేడారం పరిసరాలు, గద్దెల వద్ద దొంగలున్నారని, భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కాగా, మేడారం మినీ జాతర సందర్భంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు తప్పిపోతే తమ వద్దకు రావాలని దేవాదాయ శాఖ అధికారులు అనౌన్స్‌మెంట్ చేశారు. గద్దెల ప్రాంగణంలో రద్దీగా ఉడటంతో తప్పిపోయిన వారిని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం

మేడారం మినీ జాతరకు తరలి వచ్చిన భక్తుల పిల్లలకు, గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వనదేవతల గద్దెల ప్రాంగణంలో పంపిణీ చేశారు. బాదం పాలు, మల్టీ విటమిన్ పౌడర్, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో ఆర్. విజయ, సూపర్‌వైజర్ జి.రమాదేవి, ఎన్. శ్రావణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బయ్యక్కపేటలో చందా వంశీయుల జాగరణ

తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో చందా వంశీయులు సమ్మక్క తల్లిని ఆడబిడ్డగా కొలుస్తారు. ఈ క్రమంలో గురువారం దేవర గుట్ట నుంచి సమ్మక్క ప్రతిమ రూపంలో కుంకుమ పువ్వును తీసుకువస్తారు. అయితే బుధవారం గ్రామంలోని వనదేవతల గద్దెల వద్ద జాగరణ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు.


పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


దేవతలకు పెయ్యను సమర్పిస్తున్న చర్ప వంశీయులు


సమ్మక్క గుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


డోలు సన్నాయిలతో తరలి వస్తున్న పూజారులు

గద్దెలకు ప్రత్యేక అలంకరణ

మేడారంలో మినీ జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలు, పరిసరాలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూలు, తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు కనువిందు కలిగేలా ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లతో నేరుగా దర్శనాలు

గత జాతరలకు విభిన్నంగా వనదేవతలను భక్తులు దర్శించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రతను పెంచి భక్తులకు నేరుగా దర్శనాలు కల్పించారు. గతంలో గేట్లు వేసి బయట నుంచే మొక్కులు చెల్లించుకునేవారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మేడారం మినీ జాతర సందర్భంగా భక్తులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ మ్యూజియం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాసీల నృత్యాలు, గీతాలతో ఆ ప్రదేశమంతా మార్మోగింది.


గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్


వన దేవతలను మొక్కుతున్న భక్తులు

కొత్త కానిస్టేబుళ్ల వేతన వెతలు!

- మూడు నెలలుగా జీతాలు రాక అవస్థలు
- ఇళ్ల అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితి
- తల్లిదండ్రుల వద్ద చేయి చాపాల్సిన దుస్థితి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోలీసు యూనిఫామ్‌పై ఉన్న ఇష్టంతో.. ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి.. కఠినమైన శిక్షణ పూర్తి చేసి.. కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరిన వారు వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం సక్రమంగా వేతనాలు విడుదల చేయకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. నౌకరీ వచ్చిన సంబురం కూడా తమకు లేకుండా నెలనెలా ఖర్చుల కోసం తల్లితండ్రులు, తోబుట్టువుల దగ్గర చేయి చాచాల్సి వస్తోందని, స్నేహితుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. వరంగల్ కమిషనరేట్‌కు 578 మంది మహిళ, పురుష కానిస్టేబుళ్లను నవంబరులో కేటాయించగా వారు డిసెంబరు నుంచి వివిధ జోన్లలోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్స్ ఇచ్చి అప్పుడే రెండు నెలల 10 రోజుల సర్వీసును పూర్తి చేసుకున్న ఆ యువ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు.

స్టైఫండ్ పైసలూ ఇంతవరకు అందలేదు..

శిక్షణ సమయంలో నెలకు రూ.13వేల వేతనాన్ని స్టైఫండ్ కింద ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా వసతి, మెస్ చార్జీలు పోను సుమారు రూ.8వేల పై చిలుకు నెలనెలా శిక్షణ కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమ చేసేది. అలా 9 నెలల శిక్షణ కాలంలో 6 నెలలకు మాత్రమే చెల్లించి 3 నెలల స్టైఫండ్‌ను నిలిపివేశారు. ఇప్పటికీ ఆ డబ్బులు వారి ఖాతాల్లో జమచేయలేదు. శిక్షణ ప్రారంభ సమయంలో రూ.6వేలను ప్రతి అభ్యర్థితో డిపాజిట్ చేయించుకొని ఇప్పటి వరకు వాటి ఊసేత్తడం లేదని కొంత మంది కానిస్టేబుళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష 30వేల పై చిలుకు వేతనాలు చెల్లించాల్సి ఉందని కానిస్టేబుళ్లు పేర్కొంటున్నారు.

ఇంటి అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు

కొలువు వచ్చిందనే ఆనందం లేకుండా ఉందని పలువురు యువ కానిస్టేబుళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు కాదనుకుని ప్రజా సేవ చేసేందుకు పోలీస్‌శాఖలోకి వస్తే.. ఉద్యోగం వచ్చిన ప్రారంభంలోనే ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు. హాస్టల్ ఫీజు, రూమ్ అద్దెలు చెల్లించలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, ఉద్యోగం చేస్తున్నా.. గత్యంతరం లేక తల్లితండ్రులను, తోబుట్టువులు, స్నేహితుల వద్ద చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ వేతనాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే వేతనాలు అందించాలని యువ ఖాకీలు కోరుతున్నారు.

సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం

నవంబరు 21 న 578 మంది కానిస్టేబుల్స్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేస్తే సెంట్రల్ జోన్‌కు 145, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్‌జోన్ 68 మంది, మరో ఐదుగురిని ఇతర విభాగాలకు కేటాయించారు. వారంతా చాలా ఉత్సాహంగా విధుల్లో చేరారు. మొదటి జీతంతో తల్లిదండ్రులకు కానుక ఇవ్వాలని కొందరు, బైక్ కొనుక్కోవాలని మరికొందరు, అక్కా చెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు తమ గుర్తుగా బహుమతులు ఇవ్వాలని కలలు కన్నారు. కానీ వారి కలలన్నీ అవిరయిపోయాయి. మూడు నెలలుగా జీతాలు ఎప్పుడొస్తాయని ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వేతనాలు విడుదలైనా ఇక్కడి సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే వేతనాలు ఆలస్యమవుతున్నాయని తెలుస్తోంది. వారి అశ్రద్ధ వల్ల పోలీసులకు సకాలంలో వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని సమాచారం. ప్రతీ పనిని వాయిదా వేస్తూ ఒక్క రోజులో పూర్తి చేయాల్సిన పనిని నాలుగైదు రోజులకు జరుపుతుండటంతో యువ ఖాకీలే కాదు కమిషనరేట్‌లోని మిగతా సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తోంది.

ఖాతాల్లో సమస్యలున్నాయి.. త్వరలో విడుదలవుతాయి

రవి, అడ్మిన్ అడిషనల్ డీసీపీ

శిక్షణ సమయంలో ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాలు కాకుండా వేరే ఇవ్వడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లలో తప్పులు దొర్లడం, పాన్ కార్డులు లింక్ కాకపోవడం లాంటి సమస్యలతో వేతనాలు నిలిచిపోయాయి. స్టైఫడ్‌కు సంబంధించిన 3 నెలల జీతం ఇప్పటికే కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమయ్యాయి. సీపీవో సిబ్బంది 15 రోజులుగా ఖాతాల్లో తలెత్తిన సమస్యలను సరిదిద్దే పనిలో ఉన్నారు. త్వరలోనే వేతనాలు విడుదలవుతాయి.

నోటిఫికేషన్ లేకుండానే పోస్టు భర్తీ

ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నియామకంపై ఆరోపణలు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పోస్టును ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేయడంపై వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిందట ఓ వైద్యుడు నియామకపత్రంతో కార్యాలయానికి రావడంతో ఆశావహులైన మిగతా వైద్యులు అవాక్కయ్యారు. ఒక పక్క ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఈ పోస్టు భర్తీ చేయడం వెనుక రూ.లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ప్రైవేట్ ప్రాక్టీస్ ఉన్నవారికి ఈ పోస్టులో నియమించకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు విస్మరించినట్లు విమర్శలు ఉన్నాయి. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. రోగుల నుంచి ప్రైవేట్ ఆస్పత్రులు అదనంగా వసూలు చేస్తున్నాయా? సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా? అనే విషయాలపై ఆరా తీయాల్సిన కో ఆర్డినేటర్‌కే ప్రైవేట్ క్లినిక్‌లు ఉంటే అజమాయిషీ ఎలా చేయగలరని ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు అర్హులైన వైద్యులను కో ఆర్డినేటర్‌గా నియమించాలని వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు షురూ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి రీజినల్ హెడ్ పగడాల రవికుమార్, సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ.. మెడికవర్ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు శుభపరిణామమన్నారు. 12 దేశాలలో ప్రపంచస్థాయి వైద్య సేవలు అందిస్తున్న ప్రఖ్యాత మెడికవర్ హాస్పిటల్స్ హనుమకొండలోని ఈ 300 పడకల ఆస్పత్రికి రాజీవ్ ఆరోగ్య శ్రీ అనుసంధానించడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా గుండె చికిత్సలు, గుండె ఆపరేషన్లు, మూత్ర సంబంధిత సమస్యలకు వైద్యం, కిడ్నీ ఆపరేషన్లు, డయాలసిస్ సేవలు, మెదడు ఆపరేషన్లు, క్యాన్సర్ వైద్య సేవలు (మెడికల్ సర్జికల్ అంకాలజీ)వంటి ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా పొందవచ్చన్నారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రిలో మొదటి ఆరోగ్య శ్రీ అడ్మిషన్‌ను పేషెంట్ బంధువులకు డాక్టర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.


మెడికవర్ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన పేషెంట్‌కు రాజీవ్ ఆరోగ్య శ్రీ రిజిస్ట్రేషన్‌ను అందజేస్తున్న డాక్టర్లు

పల్లెల్లో భక్తజన సందడి

కొండాయిలో జాతర ప్రారంభం

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి) : కొండాయిలో బుధవారం మినీ జాతర ప్రారంభమైంది. కొండాయిలోని గోవింద రాజులు, నాగులమ్మ ఆలయాలతో పాటు దొడ్లలోని సారలమ్మ గుడిలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొడ్లలోని సారలమ్మ గుడిలో ఆలయ పూజారి కాకా వెంకటేశ్వర్లు సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిలో పూజలనంతరం సారలమ్మను డప్పు, వాయిద్యాల మధ్య భక్తి, శ్రద్ధలతో ఊరేగింపుగా బయల్దేరి కొండాయిలోని గోవిందరాజులు, నాగులమ్మ వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి సారలమ్మను కొండాయిలోని అమ్మవార్ల గద్దెల వద్ద ప్రతిష్ఠించారు. మినీ జాతర నేపథ్యంలో గ్రామాల్లో కోలాహలం నెలకొంది. దొడ్ల, మల్యాల, కొండాయి, దొడ్ల కొత్తూరు. గోవిందరాజుల కాలనీ ప్రజలు ఉదయాన్నే ఇళ్లూ వాకిళ్లూ శుద్ధి చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు.


డప్పు వాయిద్యాల మధ్య సారలమ్మను తీసుకెళ్తున్న పూజారులు

ఐలాపూర్‌లో గద్దెలకు చేరుకున్న సారలమ్మ


ఐలాపూర్‌లో గద్దెల వద్దకు బయలేదిన సారలమ్మ

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్‌లో నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే వన దేవతలు సమ్మక్క-సారలమ్మల జాతర బుధవారం ప్రారంభమైంది. మండలంలోని సర్వాయి గ్రామంలో మూడో గట్టు అయిన నల్లెబోయిన వంశీయులు, పూజారులు మోహన్‌రావు, వంశీ, నర్సయ్య, వడ్డెలు రాజు, సమ్మయ్య, గోవిందు ఉదయాన్నే గుడిని శుద్ధి చేశారు. తల్లులకు గిరిజన ఆచారాల ప్రకారం వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గుడిలోని సారలమ్మ రూప మైన పసిడి కుండలకు పసుపు, కుంకుమ రాసి బొట్లు పెట్టి అలంకరించారు. నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం సారలమ్మ ప్రతి రూపాన్ని తీసుకుని పూజారులు, వడ్డెలు గ్రామస్థులు డప్పు చప్పుళ్లతో సన్నాయివాయిద్యాలతో ఊరేగుతూ అటవీ మార్గం మీదు 12 కిలో మీటర్లు ప్రయాణించి ఐలాపూర్‌లోని సారలమ్మ గద్దెల వద్ద ప్రతిష్ఠించారు. గురువారం సమ్మక్క తల్లి రానుంది.

కాటారం మండలంలో జాతరలు

కాటారం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ జాతరలు బుధవారం ప్రారంభమైంది. మండలంలోని విలాసాగర్, గంగారం, పోతుల్వాయి, దేవరాంపల్లి, వీరాపూర్, మేడిపల్లి, చింతకాని తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు, భక్తులు అడవికి వెళ్లి తల్లులకు ప్రతీకగా చెప్పుకునే కంకవనాన్ని తెచ్చి డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య సారలమ్మ గద్దెపై ప్రతిష్టించారు. మేడారం మహాజాతర ఉన్న ఏడాది అక్కడికి వెళ్లే భక్తులు మినీ జాతర సమయంలో గ్రామాల్లోనే జాతర నిర్వహించి ప్రజలంతా తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. మహాజాతర లేని ఏడాది మాఘశుద్ధ పూర్ణిమ ముందు వచ్చే బుధ, గురు వారాల్లోనే జాతర జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అమ్మవార్లకు ఒడి బియ్యంతో పాటు మొక్కుకున్న విధంగా కానుకలు సమర్పించారు.

గంగారంలో ఘనంగా నాగులమ్మ జాతర

మండలంలోని గంగారంలో నాగులమ్మ జాతర గురువారం వైభవంగా సాగింది. సమ్మక్క తల్లిబిడ్డ అయిన నాగులమ్మ పేరిట గంగారంలో గత కొన్నేళ్లుగా జాతర నిర్వహిస్తున్నారు. సుమారు 30ఏళ్ల క్రితం నాగులమ్మ స్వయంభువుగా వెలిసిందని ప్రతీతి. నాగులమ్మ జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కోరిన కోర్కెలు తీర్చె కొంగు బంగారంగా భావించే భక్తులు నాగులమ్మతో పాటు సమ్మక్క, సారక్క గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులకు ఒడి బియ్యం పోశారు.


నాగులమ్మ జాతరలో భకులు

కొయ్యూర్‌లో నాగులమ్మ జాతర


నాగులమ్మ జాతరలో భక్తులు

మల్హర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ ఆలయం వద్ద బుధవారం జాతర నిర్వహించారు. ప్రతి ఏడాది మేడారం సమ్మక్క, సారక్కల జాతర సమయంలో ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతర రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు జాతరకు భక్తుల తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. తాడిచర్ల ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు పూర్తి చేసినట్లుతెలిపారు. అలాగే చిన్నతూండ్లలో సమ్మక్క, సారక్కల గద్దెల వద్ద పౌర్ణమి సందర్భంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాయతీ ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలి : డీపీవో

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజ్ అన్నారు. బుధ వారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటిదశలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా తయారు చేయడం, రెండోదశలో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికల కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలకు లోబడి నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి శిక్షకులు తెలియజేసిన అంశాలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని ఎన్నికల నియమావళిని చేపట్టాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్, ఎన్నికల ఫలితాలు, ఉపసర్పంచ్ ఎన్నిక విషయాలను ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా చేపట్టాలన్నారు. ములుగు, మల్లంపల్లి ఎంపీడీవోలు రామకృష్ణ, రహీమొద్దీన్, మాస్టర్ ట్రైనర్లు శిరువ సతీష్‌కుమార్, ఎమ్డీ.హమీద్, డి.సూర్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్, ఎల్.రమేష్, ఎం.మధు, టి.రాజేష్, ఎ.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి : కాంగ్రెస్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా యువజన నాయకులు పనిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్సార్‌ఖాన్ పిలుపునిచ్చారు. ములుగులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో యువజన కాంగ్రెస్ కమిటీలను నియమించి పార్టీ బలోపేతం కోసం మండల, గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా, నియోజకవర్గ నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి నేపాల్‌రావు, పట్టణ అధ్యక్షుడు అభి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, నాయకులు షైపాల్‌రెడ్డి, సుమన్, ఖలీద్, మినహాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన డీసీఎస్‌వో

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు, వెంకటాపూర్ మండలాల్లోని మీసేవ కేంద్రాల్లో కొనసాగుతున్న నూతన రేషన్‌కార్డు నమోదు ప్రక్రియను జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్‌వో) సయ్యద్ షా ఫైసల్ హుస్సేన్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్‌కార్డుల నమోదు ప్రక్రియను చేపట్టిందని, ఆహారభద్రత కార్డులో కొత్తగా కుటుంబ సభ్యుని నమోదు, తొలగించడానికి, కుటుంబ సభ్యుని పేరు, వయసు, చిరునామా, ఆధార్ నంబర్‌లను సవరణ చేసుకునేందుకు మీసేవలో అవకాశం ఉందని అన్నారు.ప్రజలు నిర్ణీత రుసుము చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు నమోదు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, తప్పులు లేకుండా అప్లికేషన్ నమోదు చేయాలని మీసేవ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ ద్వారా దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు మరలా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి మీసేవ కేంద్రంలో సిటిజన్ చార్టర్, మీసేవ ఫ్లెక్సీలు, ఇంటర్నెట్, స్టేషనరీ తప్పకుండా ఉండాలని, దరఖాస్తుదారుడితో దురుసుగా ప్రవర్తించవద్దని, దరఖాస్తుదారుడికి రశీదుపత్రాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుముకంటే ఎక్కువ రుసుము తీసుకున్నట్లయితే సంబంధిత మీసేవ కేంద్రంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా నిర్మాణ కార్మికులు లేబర్‌కార్డు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ నితీష్, మీసేవ డిస్ట్రిక్ట్ మేనేజర్ విజయ్ ఉన్నారు.

దళిత డప్పు కళాకారుల కార్యవర్గం ఎన్నిక

గోవిందరావుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట గ్రామ దళిత డప్పు కళాకారుల సంఘం నూతన కమిటీని బుధవారం మండల అధ్యక్షుడు బైరపాక రమేష్, ప్రధాన కార్యదర్శి బొచ్చు రవి ఆధ్వర్యంలో ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా పోలెపాక కుమార్, ఉపాధ్యక్షుడిగా కేశపాక కార్తీక్, గౌరవ అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, సభ్యులుగా జన్ను రవి, కుక్కల వెంకన్న, భిక్షపతి, కట్ల ఐలయ్య, లింగయ్య, సాంబయ్య, దర్శనాల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

గణపురం, ఫిబ్రవరి 12: కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (టీఈఈ)-1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కేటీపీపీ ఆవరణలో ఆ సంఘం అధ్యక్షుడు ఊరుగొండ సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగరవేసి స్వీట్లు పంచుకున్నారు. కార్మికులకు ఎలాంటి న్యాయ సమస్యలు వచ్చినా వారి పరిష్కార మార్గానికి యూనియన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ కుమారస్వామి, శ్రీనివాస్, ముక్తీశ్వర్, అల్లం సంపత్, అనంతరామయ్య, తిరుపతి, రవీంద్రచారి, సురేష్, చంద్రమౌళి, అనిత, వసంత, శిరీష, శోభ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్య

కాకతీయఖని, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాలలో తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని పేర్కొన్నారు. 2004లో భూపాలపల్లి ఏరియాలో పాఠశాలను ప్రారంభించారని, ఇప్పటి వరకు ఇక్కడ చదివిన విద్యార్థులు ఎన్నో ఉన్నత శిఖరాలను అవరోదించారని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు రూ. 3,300 ఫీజు ఉంటుందని, 6 ,7వ తరగతి పిల్లలకు రూ.4,400, 8,9,10వ తరగతి చదివే వారికి రూ.5,500 ఫీజు ఉంటుందని తెలిపారు. అలాగే వ్యాన్ ఫీసు రూ. 1200 నుంచి 1600 ఉంటుందని తెలిపారు. ఇతర ప్రైవేటు పాఠశాలతో పోలిస్తే సింగరేణి పాఠశాలలో ఫీజు చాలా తక్కువగా ఉన్నం దున సింగరేణి కార్మికులు తమ పిల్లలను మన పాఠశాలలో చేర్పించాలని కోరారు. సీబీఎస్ఈ సిలబస్ కోసం కార్పోరేట్‌కు ప్రపోజల్ పంపిస్తున్నామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మధు

కాటారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధ వారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరావర్శించారు. గారెపల్లిలో కడారి దుర్గయ్య, అక్కపాక మణెమ్మ, బయ్యారంలో పసుల సమ్మయ్యలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పుట్ట మధు పరామర్శించారు. మృతుల కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. సబ్‌స్టేషన్‌పల్లిలో ఇటీవల లారీ ఢీకొని రెండు కాళ్లు కోల్పోయిన తోట రవిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జనార్దన్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు పంతకాని సడువలి, గాలి సడవలి, రాజు, దుర్గారావు, లింగయ్య, రాజబాపు, అశోక్ తదితరులు ఉన్నారు.

ధ్యానంతోనే జీవిత పరమార్థం

కాటారం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగాతో శారీరక, మానసికోల్లాసంతో పాటు జీవిత పరమార్థం తెలుస్తుందని రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేట ర్ చెరుకుపల్లి రవీందర్ అన్నారు. కాటారం మండలకేంద్రంలోని అయ్యప్ప కళ్యాణ మండపంలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత యోగా, ధ్యాన శిక్షణ తరగతులు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ మాట్లాడుతూ ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, విద్యార్థి నుంచి మొదలుకుని ఉద్యోగులు, వృద్ధుల వరకు నిరంతరం ఒత్తిడిని ఎదుర్కోవడం అందరికీ అనుభవమేనని అన్నారు. ఒత్తిడిని, ఆందోళనలను సమర్థంగా ఎదుర్కొనడానికి యోగా, ధ్యానం దోహదం చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు మాధవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ

కాటారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ జడ్పీహెచ్ఎస్‌లో డివిజన్‌లోని కాటారం, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్)పై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ విద్యా విధానాన్ని ప్రోత్సహించడం లో భాగంగాప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో నెలకొల్పిన డిజిటల్ బోర్డుల ద్వారా బోధించేలా కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీదేవి నేతృత్వంలో ఇంగ్లీష్ టీచర్లకు శిక్షణనిచ్చారు. రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన బొల్లం సతీష్, బాలరాజు, రాజయ్య, రామ్మూర్తి ఐదు మండలాల్లోని పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు.

ములుగు జిల్లాలో 492 పోలింగ్ స్టేషన్లు

ములుగు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమైన క్రమంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఏ క్షణం లోనైనా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలుండగా క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం వంటి చర్యలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ముసా యిదా ను జిల్లా అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సంపత్ రావు విడుదల చేశారు. నూతనంగా ఏర్పడ్డ మల్లం పల్లి మండలంతో కలుపుకొని మొత్తం పది మండ లాల పరిధిలో 2,45,015మంది ఓటర్లుండగా మహిళలు 1,26,418 మంది, పురుషులు 1,18,572 మంది, 25 మంది ఇతరులున్నట్లు తెలిపారు. 492 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 10 జడ్పీటీసీ, 87ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మండలం	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	పీసీలు	ఓటర్లు
ములుగు	13	1	73	38,910
మల్లంపల్లి	5	1	25	13,462
వెంకటాపూర్	9	1	58	28,350
గోవిందరావుపేట	9	1	64	25,490
తాడ్వాయి	7	1	38	18,389
ఏటూరునాగారం	9	1	41	24,590
మంగపేట	14	1	77	39,689
వాజేడు	7	1	41	19,411
కన్నాయిగూడెం	5	1	21	9943
వెంకటాపురం	9	1	54	26,781

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొడారి చిన్నఐలయ్య, గుండారపు నరేష్‌లు ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందగా బుధవారం భూపా లపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామ ర్శించారు. ఆయన వెంట చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎమ్డీ.రఫి, కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, నాయ కులు ధర్మారావు, లింగారావు, రాములు, తదితరులు ఉన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తప్పదు : మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : అడుగడుగునా రైతుల ను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఉసురు తగులుతుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ అని చెప్పి సగంలోనే వదిలేశారని విమర్శిం చారు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రెండు దఫాలు ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. మూడు పంటలకు రైతు బంధు ఇస్తామని చెప్పి ఉన్నది ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తే.. రేవంత్‌రెడ్డి కోతలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం

తీవ్ర సంక్షోభంలో ఉన్న మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకునే వరకు బీఆర్ఎస్ పక్షాన పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలో రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతులకు క్వింటాలుకు రూ. 20,500 అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకులు సాంబారి సాయికుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్, హమీద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, బీఆర్ఎస్ రైతుబంధు సమితి జిల్లా మాజీ అధక్షుడు హింగె మహేందర్, కోటంచ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, బీఆర్ఎస్ రేగొండ టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పేరాల ప్రశాంత్, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, కుసుభ రంజిత్‌కుమార్, రూపిరెడ్డి చంద్రారెడ్డి, గోగుల చంద్రాకర్‌రెడ్డి, మహ్మద్ రహీం, కేటీఆర్‌సేన మండల అధ్యక్షుడు అనూష్‌రెడ్డి, యూత్ నాయకులు నరేష్, చింటూ, పాశా తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓడ వాడలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ మూడో వారోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ గుడి నిర్మాణానికి మూడేళ్లు పూర్తి కావడంతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం కార్యక్రమాన్ని నిర్వహించగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు (లక్ష్మణ్ బాబు) ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం హోమంలో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన కోఆప్షన్ మాజీ సభ్యుడు ఖలీల్ మాతృమూర్తి, బట్ట రాములు ఇటీవల మృతి చెందగా లక్ష్మణ్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకులమర్రి ప్రదీప్ బాబు, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, తుమ్మ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖాజా పాషా, తాడూరి రఘు, ఎమ్డీ. వలీబాబా తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు ఐటీఐలలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థులు ములుగు జిల్లాకేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి తుల రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ఎంతో లాభం జరుగుతుందని, ఏఉద్యోగం పొందడానికైనా రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు. డబ్లూడబ్ల్యూడబ్ల్యూ.ఎంప్లాయిమెంట్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

వెంకటాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని వెంకటాపురం సెక్షన్ అధికారి దేవయ్య అన్నారు. బుధవారం మండలంలోని నూగూరు, మహితాపురం గ్రామాల్లోని ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, అడవుల సంరక్షణతోనే స్వచ్ఛమైన గాలితోపాటు పండ్లు లభిస్తాయని అన్నారు. అడవికి నిప్పు పెడితే జీవరాశులకు నీడ, ఆహారం లభించక అంతరించిపోతాయని అన్నారు. అడవిలోకి చీపుర్ల సేకరణకు వెళ్లే ప్రజలు అడవికి నిప్పుపెట్టకుండా చెట్ల కింద పరదాలు పరచుకుని సేకరించుకోవాలని ఆయన సూచించారు. బీట్ ఆఫీసర్లు ప్రణవి, సరళ, గొంది నారాయణ, బేస్‌క్యాంప్ సిబ్బంది లక్ష్మయ్య, నరేష్, రమేష్, సురేష్, పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల సందడి

మహదేవపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని భక్తుల సందడి నెలకొంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. మహారుద్రాభిషేకాలు, అభిషేకాలు, స్వామి వారి దర్శనాలతో పాటు అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, సరస్వతీదేవికి పలు ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి పుణ్యదినం కావడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలోని అనేక మంది భక్తులు ఉదయం నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.


కాళేశ్వరాలయలో పూజలు చేస్తున్న భక్తులు

పారితోషికం రాక పరేషాన్

(5వ పేజీ తరువాయి)

ముగిసేలోపు వినియోగించుకోవడం కుదరదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లా వ్యాప్తంగా 1,081 మంది

కులగణన సర్వే చేసిన ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేల చొప్పున చెల్లిం చాల్సి ఉంది. మొత్తంగా రూ. కోటి పైనే పారితోషికం చెల్లించాల్సి ఉంది. మహదేవపూర్ మండలంలో 80 మంది, పలిమెల 24, ముత్తారం 73, కాటారం 96, మల్హర్ 69, చిట్యాల 91, టేకుమట్ల 69, మొగుళ్లపల్లి 87, రేగొండ-100, గణపురం 122, భూపాలపలి 101, కొత్తపల్లిగోరి 56, భూపాలపల్లి మున్సిపాలిటీ 113 మంది ఎన్యుమరేటర్లుగా పనిచేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 1,081 మంది సర్వే విధుల్లో పాల్గొన్నారు. వీరితో పాటు పది మంది ఎన్యుమరేటర్లకు ఒక్కో సూపార్‌వైజర్‌ను కేటాయించగా జిల్లా వ్యాప్తంగా వారి సంఖ్య 128 ఉంది. అయితే ఇప్పటి వరకు సర్వే డబ్బులతో పాటు సీసీఎల్ లు కూడా యాడ్ చేయక పోవడంతో ఎన్యుమరేటర్ల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. పారితోషికంపై మండలాధికారులను పలువురు ఎన్యుమరేటర్లు ఇప్పటికే వాట్సాప్ వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఇంకా కొంత మందైతే నిధులు పక్కదారి పట్టాయంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే డబ్బులు ఇప్పించడంతో పాటు సీసీఎల్స్‌ను వినియగించుకునేలా అవకాశం కల్పించాలని ఎన్యుమరేటర్లు కోరుతున్నారు.